కథ

# విజయం

–ఎస్.డి.ఎస్.వి.నాగేశ్వరరావు

**గాలి బలంగా వీస్తోంది.**

**బస్సు ప్రయాణం అంటే విసుక్కునే నేను, ఈ ప్రయాణం నాకు నచ్చి చేస్తున్నాను. ఎందుకంటే నా చిన్ననాటి కోరిక ఫలించే తరుణం ఇది.**

నేను ఆర్మీ సెలక్షన్‌కి వెడుతున్నాను.

ఎదురుగాలి అవడంతో బస్సులో కిటికీ దగ్గర కూర్చున్న నాకు గాలి విసురుగా కొడుతోంది. ఇంకా సాయంత్రం కావడానికి చాలా టైమ్ ఉంది. వరుసగా ఊర్లు అన్నీ దాటుకుంటూ బస్సు ముందుకు సాగుతోంది. హఠాత్తుగా వాతావరణం చల్లబడినట్టు అనిపించింది. దూరం నుంచి మేఘాలు కమ్ముకొస్తున్నాయి. ఆ కారుమేఘాలతో పాటు చల్లని గాలి కలసి 'వర్షం వస్తుంది' అని తెలియజేస్తోంది. ఇంకాస్త ముందుకు వెళ్ళే సరికి వర్షపు జల్లులు ప్రారంభమయ్యాయి. దాంతో అద్దాలు మూసేసి బయటకు చూస్తూ కూర్చున్నాను. గాలితోపాటు చక్కగా ఊగుతోన్న చెట్లు, పంట పొలాలు నా భవిష్యత్తుకు ఆహ్వానం పలుకుతున్నట్టు ఉన్నాయి.

వాతావరణం హాయిగా ఉండడంతో కళ్ళు మూసుకొని గతం వైపు దృష్టి సారించాను.

చిన్నప్పటి నుంచి నాది అన్యాయాన్ని ఎదిరించే మనస్తత్వం. అందుకే భగత్‌సింగ్‌లాంటి వీరులన్నా, సుభాష్ చంద్రబోస్‌లాంటి నాయకులన్నా చాలా ఇష్టపడే వాణ్ణి. అలాగే ఆర్మీలో పనిచేసి వచ్చిన మా తాత అన్నా నాకు చాలా ఇష్టం.

నా చిన్నతనంలో మా తాత చెప్పే యుద్ధం కథలు చాలా శ్రద్ధగా వినేవాణ్ణి. ఆ వీరుల స్థానంలో నన్ను ఊహించుకునే వాణ్ణి. ఒక రకంగా అదే నాలో ఆర్మీలో చేరాలన్న ఆసక్తిని కలిగించిందేమో.

మా తాతయ్య చెప్పే వారు 'ఆర్మీలో చేరాలంటే కండబలం, గుండెబలంతో పాటు బుద్ధిబలం కూడా ఉండాలిరా' అని. అందుకే చిన్నప్పటి నుంచి 'జిమ్'కి వెళ్ళటం, రకరకాల ఆటలలో పాల్గొనడం చేసేవాడిని. నాకు నచ్చిన ఆటల్లో కబడ్డీ చాలా ముఖ్యమైనది. దాంట్లో గెలవాలంటే చాలా ఒడుపు ఉండాలి. మనవైపు ఒక్కడే మిగిలినా కూడా తట్టుకుని పోటీ చేసే గుండెబలం ఉండాలి. అవతల వాడిని మన ట్రాప్‌లోకి లాగి, వాడిని అవుట్ చేసే తెలివితేటలుండాలి. క్రమంగా బలం పెంచుకున్నాక, టీమ్ వర్క్‌తో అవతల జట్టుని ఓడించాలి. ఈ ఆటలో టీమ్ వర్క్‌కున్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు.

ఏదైనా అంశంలో ఇష్టం అన్నది ఉంటే, అందులో రాణింపు త్వరగా వస్తుంది. అందుకే నేను ఆటల్లో చాలా మంచి పేరు సంపాదించుకున్నాను. రెగ్యులర్‌గా ఏదో ఒక బహుమతి సంపాదిస్తూనే ఉండే వాడిని.

అలా అని చదువుని నేనెప్పుడూ అశ్రద్ధ చేయలేదు. క్లాసులో ఫస్టు రాకున్నా, ఎప్పుడూ ఫస్టు క్లాసు మార్కులు వచ్చేవి. అలా నేను ఎదుగుతూ వచ్చాను. ఆ సమయంలోనే వేరే ఉద్యోగం చేస్తూండే మా తాత రిటైరయ్యారు. ఆర్మీ నుంచి రిటైరై వచ్చాక, ఆయన వేరే ఉద్యోగంలో చేరారు. మా బామ్మ కూడా నర్సుగా ఉద్యోగం చేస్తుండేది. వాళ్ళిద్దరి సాహచర్యంలో పెరిగిన నేను, క్రమశిక్షణకు, అంకితభావానికి ప్రతీకగా నిలిచాను. వారిద్దరూ నన్ను చూసి చాలా పొంగిపోయేవారు. వాళ్ళని చూసి నేను కూడా అంతే గర్వపడే వాడిని.

వాళ్ళకి మా నాన్న, అత్త ఇద్దరే పిల్లలు. కాబట్టి, వాళ్ళు సంపాదించినదంతా వీరికే ఇచ్చేవారు. మా తాత రిటైరవగానే వచ్చిన డబ్బులు పిల్లలిద్దరికీ సమంగా పంచేశారు. అదే, మా అమ్మ కోపానికి కారణం అయ్యింది. దాంతో కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి.

సాధారణంగా ఏ తల్లీ, తండ్రీ అయినా కొడుకు దగ్గర ఉండటానికే ఇష్టపడతారు. మా తాత, బామ్మ అందుకు విరుద్ధం ఏమీకాదు. కానీ, పరిస్థితులు ఎదురు తిరగడంతో వాళ్ళు వేరే వెళ్ళిపోవలసి వచ్చింది. ఆ రోజు నా జీవితంలో నేను మొదటిసారిగా బాధపడ్డాను. కానీ, నా చేతుల్లో ఏమీలేదు. తాతకి, బామ్మకి ఎంతగానో చెప్పి చూశాను. గాయపడిన వాళ్ళ హృదయాలను అతికే మందు మరి నా దగ్గర లేదు. అమ్మకి చెప్పాలనుకున్నా, ఆ ధైర్యం నాకు లేదు. బామ్మ దగ్గర ఉన్న చనువు, అమ్మ దగ్గర నాకు ఎప్పుడూ లేదు.

కాలక్రమంలో తాత దగ్గరకి నా రాకపోకలు కట్టడి అయ్యాయి. అయినా తాతని చూడకుండా నేను ఉండలేను. ఆ సమయంలోనే నేను తెలుసుకున్నదేమిటంటే, తాతకి పెన్షన్ రాదు అన్న సంగతి. అందుకనే వాళ్ళని భారంగా తలచి, అమ్మ వాళ్ళని బయటకు పంపిందన్న సంగతి. ఇక, బామ్మకి వచ్చే ఆదాయం కూడా, ఆమె రిటైరవడంతో తగ్గుతుందని ఊహించి, వాళ్ళని దూరం చేశారన్న సంగతి. అయితే, అమ్మ అంటే నాకున్న అభిమానం, ఆమెకు ఎదురు తిరగలేనట్టుగా చేసింది.

అనుకున్నట్టే బామ్మ రిటైరయ్యింది. ఆమెకి వచ్చే పెన్షన్, వాళ్ళ రోగాలకు, మందులకి బొటాబొటీగా సరిపోవడం మొదలైంది. ఈ సంగతులు అన్నీ తెలుస్తున్నా ఏమీ సహాయం చేయలేని పరిస్థితి నాది. ఒకటి రెండుసార్లు నేను దాచుకున్న పాకెట్ మనీ వాళ్ళకి ఇవ్వాలని ప్రయత్నించినా ప్రేమగా దెబ్బలాడి, వద్దని చెప్పారు. అంతేకాకుండా నాకే చిన్న చిన్న వస్తువులు, స్వీట్స్ కొని ఇచ్చేవారు. తాత, బామ్మల ప్రేమ ముందు ప్రపంచంలో ఏదైనా బలాదూర్.

అప్పుడే ఒక రోజు మా తాతని అడిగాను. ''తాతా! నువ్వు ఆర్మీ గురించి ఎంతో గొప్పగా చెబుతావు కదా! మరి నీకు పెన్షన్ కూడా లేదే. ఈ కష్టాలన్నీ ఎందుకు?'' అని.


మా తాతకి కోపం వచ్చింది. పెన్షన్ ఇవ్వని వాళ్ళమీద కాదు, ఆ ప్రశ్న వేసిన నా మీద.

శాంతంగానే అయినా గట్టిగా చెప్పారు మా తాత. ''ఒరేయ్ మనవడా! నేను సైన్యంలో ఉండగా

రెండవ ప్రపంచ యుద్ధం జరిగింది. నేను బ్రిటిష్ సైన్యంలో ఉండడం, స్వాతంత్ర్యం వచ్చినప్పుడే నేను రిటైర్ అవడంతో మాకు పెన్షన్‌లు ఇవ్వలేదు. ఆ తర్వాత ఒకటి, రెండుసార్లు దానికోసం ప్రయత్నించాలని చూసి, ఆఫీసుల చుట్టూ తిరగలేక మానేశాను. అయినా, దేశంకోసం సేవ చేశానన్న తృప్తి, ఆగస్టు 14 రాత్రి ఎగురవేసిన జెండాను చూశానన్న తృప్తి చాలురా ఈ శరీరానికి.''

వెంటనే నేనన్నాను 'కానీ, తాతా! ఆ మధ్య నువ్వేదో వంద రూపాయల పెన్షన్‌కోసం తిరిగావని బామ్మ చెప్పింది.' 'అవునురా నాయనా! నాలాంటి






ఆనాటి సైనికులకి వంద చొప్పున ప్రతి నెల ఇస్తారంటే, మీ బామ్మే నాకు ఇష్టం లేకున్నా వెయ్యి రూపాయలు లంచం ఇచ్చి మరీ ఆ పెన్షన్ ఇప్పించింది. నేను కూడా దేశం ఈ విధంగానైనా నన్ను గుర్తించిందనే ఉద్దేశంతో ఒప్పుకోక తప్పలేదు. అయినా, వాళ్ళిచ్చే వంద రూపాయలతో నాకు ఏం లభిస్తుందని నేను ఎప్పుడూ ఆలోచించలేదు' అన్నారు మా తాత.

ఇంక ఏమనాలో తోచలేదు నాకు. కానీ, ఆర్మీలో క్రమశిక్షణ, అంకిత భావం ఏ నాటికీ తరగవు అన్న భావం ఏర్పడింది నాకు.

అలా అలా నాలో నాటుకున్న భావాలు పెరిగి, మొలకలు వేశాయి.

ఇంటర్ పాస్ అవగానే ఆర్మీలో చేరాలన్న నా కోర్కెను ముందుగా మా తాతకు చెప్పాను. ఆయన ఎంతో సంతోషించారు. కానీ, మరుక్షణంలోనే ఆయన ముఖంలో మార్పు నాకు ఇబ్బందిగా అనిపించింది. 'ఒరేయ్ మనవడా! నువ్వా మీ అమ్మా, నాన్నకి ఒక్కగానొక్క కొడుకువి. వాళ్ళు నిన్ను ఆర్మీకి పంపుతారంటావా? అయినా ప్రయత్నం చేసి చూడు. నా ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉంటాయి' అన్నారు.

నాన్న దగ్గరకి వెళ్ళి నా కోరిక చెప్పాను. అనుకున్నట్టుగానే నాన్న 'ఒరే వెధవా! నిన్ను ఏ ఇంజనీరో, కంప్యూటర్ ప్రొఫెషనల్నో చెయ్యాలని నే చూస్తుంటే, ఇలాంటి చెత్త ఆలోచన లేమిట్రా' అన్నారు. అసలే యువరక్తమేమో నాకూ రోషం వచ్చింది. 'నావి చెత్త ఆలోచనలు కావు. దేశ మాతకి సేవచేస్తూ, కీర్తి ప్రతిష్ఠలు పొందటం కంటే గొప్ప పని వేరేది లేదు' అన్నాను. 'ఆ! దేశమాత నీ సేవల కోసమే ఎదురు చూస్తోంది. నోరు మూసుకుని, శ్రద్ధగా చదువుకో' అన్నారు నాన్న. కానీ, నేను నా పట్టు విడవలేదు. దాంతో 'మీ అమ్మకు చెప్పు' అన్నారు నాన్న. చెప్పగానే అమ్మకు కోపం వచ్చింది. 'చెప్తూనే ఉన్నాను. మీ నాన్న దగ్గరికి చేరనివ్వొద్దు వీడిని అని. వినలేదు మీరు. చూశారా వాడిని ఆయన ఎలా తయారు చేశాడో. ఆయన ఆర్మీలో చేసి సంపాదించాడుగా ఆస్తులు, ఇప్పుడు వీడు వెళ్ళి సంపాదిస్తాడు.'

నా మీద కోపం తాత మీదకి, నాన్న మీదకి అలా... అలా ఎటో వెళ్ళిపోయింది.

అమ్మని ఆపడం నా తరంగాని, నాన్న తరంగాని కాలేదు. అలాగే, చివరకు నన్ను ఆర్మీలో చేరకుండా ఆపడంకూడా ఎవరివల్లా కాలేదు. ఎల్లాగైనా నేను ఆ అమ్మ కొడుకునే కదా.

నేను ఆర్మీ సెలక్షన్‌కోసం బయలుదేరాను.

చల్లని నీరు కళ్ళమీద పడటంతో కళ్ళు తెరిచాను. ఎవరో అడ్డం జరపడంతో వర్షపు చినుకులు నా మీద తూలాయి.

OOO

గాలి బలంగా వీస్తోంది.

నిస్సత్తువతో కళ్ళు తెరవాలన్నా చాలా కష్టంగా ఉంది. మనసు చాలా ప్రశాంతంగా ఉంది. ఏదో సాధించానన్న సంతృప్తిలేని బలాన్ని నాలో తిరిగి పుట్టిస్తోంది.

నా సంతోషాన్ని పంచుకునేందుకు నా తోటి వారెవరూ మిగలకపోయినా, వారి త్యాగం నాకు ఆనందాన్ని కలిగిస్తోంది. అవును, వారు నిజంగా అమరవీరులే. ప్రజలకు వారి పేర్లు తెలియకపోయినా, వారి త్యాగాన్ని కలకాలం గుర్తుంచుకు తీరతారు. నా దేశ ప్రజలపై నాకా నమ్మకం ఉంది.

నీరసంతో తల తిరుగుతోంది. కళ్ళు మూసుకుని గతంలోకి జారుకున్నాను.

గత నాలుగేళ్ళలో నా స్థితిలో చాలా మార్పులు వచ్చాయి. నా కోరికకు తగినట్టుగా నేను ఆర్మీలో జాయినయ్యాను.

ఆర్మీ ట్రెయినింగ్ నాలో జీవితాన్ని ఎదుర్కోగలిగే ధైర్యాన్ని, తెగింపును ఇచ్చింది. ఎలాంటి పరిస్థితినైనా నాకు అనుకూలంగా మార్చుకోగలిగే తెలివితేటలూ వచ్చాయి. కాన్వెంటుల్లో చదువులు, కాలేజీలో షికార్లు నాకు పుస్తకాల జ్ఞానాన్నే ఇచ్చాయి. కానీ, నలుగురితో కలిసి గడించిన కలివిడితనం, అన్ని ప్రాంతాల వారితో తిరిగి సంపాదించిన లోకజ్ఞానం నాలో ఒక సంపూర్ణ వ్యక్తిత్వ సాధనకు సహకరించాయి. అందరితో కలిసి టీమ్‌గా పనిచేసే గుణం నా ట్రూప్‌లో నాకంటూ ఒక గుర్తింపును తెచ్చింది.

సెలవులలో ఇంటికొచ్చిన నేను మా తాతకి అన్ని విశేషాలు చెప్పే వాడిని. మా తాత అన్నీ విని సంతోషించి 'ఒరే మనవడా! నువ్వు ఏదైనా సాధించాలిరా! అది నేను పది మందికీ చెప్పుకొని గర్వపడాలిరా!' అన్నారు. అది నా గుండెల్లో నిలిచిపోయింది.

అమ్మ షరా మామూలే. మా తాతని తిట్టుకుంటూ, నన్ను ఆ ఉద్యోగం మానెయ్యమని గోల. అమ్మకి చెప్పాను, 'అమ్మా! నీ ఆవేదన నాకు తెలుసు. కానీ, ప్రతి దానికీ భయపడి, చేతులు ముడుచుకు కూర్చునే మనస్తత్వం కాదు నాది. మీ అందరి ఆశీస్సులు ఉన్నంతకాలం నాకేమీ కాదు. నా గురించి బెంగ పెట్టుకుని ఆరోగ్యం పాడు చేసుకోకు' అని.

నాన్నకి కాస్త భయంగా ఉన్నా, గాంభీర్యం ప్రదర్శిస్తూ 'అవునురా కన్నా! నీకు నచ్చిన మార్గం నువ్వు ఎన్నుకున్నావు. ఒడిదుడుకులు ఏ రంగంలోనైనా తప్పవు. వాటిని ధైర్యంగా తట్టుకుని నిలబడాలి. అప్పుడే నీ లక్ష్యం నువ్వు చేరుకోగలవు. ఆ ధైర్యాన్ని, స్థైర్యాన్ని నీకివ్వమని ఆ దేవుణ్ణి రోజూ ప్రార్థిస్తాను నేను' అన్నారు. 'అది చాలు నాన్నా! నేను నిశ్చింతగా ముందుకు సాగుతాను' అన్నా నేను.

అమ్మ నా పెళ్ళి సంబంధాల ప్రసక్తి తెచ్చింది. నేను చెప్పాను 'నేనో స్థాయి చేరాలి. అంతవరకూ నో'

అని.

సెలవులు పూర్తయి, నేను డ్యూటీలో జాయిన్ అయ్యాను. మేలో పాకిస్తాన్ సైనికులు విద్రోహుల రూపంలో మన దేశంలోకి ప్రవేశించడం, మన సైన్యం యుద్ధం ప్రారంభించటం జరిగింది. అందులో భాగంగా నన్ను కూడా సరిహద్దుల వద్ద యుద్ధానికి పంపారు. ఆ రోజు నేను ఎంతగా సంతోషించానో చెప్పలేను. దేశమాత రక్షణకై నా శరీరం ఎంతగానో తహతహలాడుతోంది.

మా ట్రూప్ మందు పాతరలు తొలగించుకుంటూ మెల్లగా ముందుకు సాగుతోంది. ప్రతికూల వాతావరణం మమ్మల్ని ఇబ్బంది పెడుతోంది. అయినా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతున్నాం.

ఆ రోజు మొట్టమొదటి సారిగా రెండు కిలోమీటర్ల దూరంలోని శత్రు స్థావరాన్ని మేం గుర్తించటం జరిగింది. అయితే అది చాలా ఎత్తులో ఉంది. వెన్నెల వాతావరణం. దాంతో వారికి మేం స్పష్టంగా కనబడిపోతున్నాం. ముందుకు అడుగు వేయకుండానే మాపై ఫిరంగుల వాన మొదలైంది. మాలో ఐదారుగురు సైనికులు మరణించారు. మేమంతా చెట్ల చాటుకు తప్పుకున్నాం.

ఇక, ముందుకు సాగటం కష్టమవుతోంది. అందుకే అందరం గ్రూపులుగా విడిపోయి ముందుకు వెళ్ళాలని నిర్ణయించుకున్నాం. అంగుళం అంగుళంగా కదిలిన మేము, చాలా మెల్లగా ముందుకు చేరుతున్నాం.

ఏ ఒక్కరం వారి కంటపడినా మిగిలేవి మా మృత దేహాలే. అందుకే ముందుగా ఒక దళం కదిలింది. వారిని దాపుగా చేసుకుని, కాస్త దూరంలో మరికొందరు కదిలారు.

ఫైరింగ్ మొదలైంది. అటునుంచి భీకరంగా కాల్పులు. మేం మాత్రం తక్కువ తిన్నామా. క్రమంగా అర్ధ చంద్రాకారంలో కదలి వారిపై కాల్పులు ప్రారంభించాం. అక్కడ సైనిక బలం, మందుగుండు ఎక్కువగానే ఉన్నాయని, అది చాలా కీలకమైన స్థావరమని అర్థమవుతోంది. అయినా, భయం అన్నది మా నిఘంటువులోనే లేదు.

ముందడుగు వేసిన మా వాడు ఒకడు తుపాకీ దెబ్బకు నేలకూలాడు. కానీ, ఆ లోపునే ఇద్దరిని చంపాడు తను. స్థావరంపై నుంచి క్రిందపడిన శవాలే సాక్ష్యం.

క్రమంగా ఆ స్థావరం దగ్గరకు చేరాం. ఈ లోపున మాలో సగం మంది అసువులు బాశారు. కానీ, వారికోసం కన్నీరు కార్చే సమయం మాకు లేదు. అయినా, వారికోసం ఎందుకేడవాలి? వారు దేశం కోసం ఆనందంగా ప్రాణాలు వదిలారు. నిజంగా వారిని చూసి మేం గర్వించాలి.

అందుకే, ధైర్యంగా ముందుకు కదిలాం. మా ధైర్యం శత్రువుల్లో భయాన్ని కలిగిస్తోందని అర్థమవుతోంది. ఒక లక్ష్యం, గురిలేకుండా వారు కాలుస్తున్న విధానం వారి మానసిక స్థితికి అద్దం పడుతోంది. అది మాలో మరింత ఉత్సాహాన్ని పుట్టిస్తోంది.

అడుగు, అడుగుకి మా నుంచి కాల్పులు పెరుగుతున్నాయి. రెండు వైపులా మరణించే వారి సంఖ్య పెరుగుతోంది. మా దళంలో ఎంత మంది మిగిలారో లెక్కించడం చాలా సులభం. కానీ, నాలో ఉన్న తెగింపే నన్ను ముందుకు నడిపిస్తోంది.

క్రితం రోజు తాత నుంచి వచ్చిన ఉత్తరం నాలో నూతనోత్తేజాన్ని నింపింది. నాకోసం బాధపడుతున్నా, దేశ మాత సేవలో ప్రాణాలు కూడా లెక్కచేయకూడదని, ఇలాంటి అవకాశం మరలా మరలా రాదని, కాబట్టి యుద్ధంలో వీర సైనికుడిలా ముందుకు దూసుకు పోవాలని వ్రాసిన మా తాత ఉత్తరంలోని అంశాలు పదే పదే నాకు కర్తవ్యాన్ని ఉద్బోధిస్తున్నాయి.

మా దళం బలం తగ్గిన సూచనలు కనిపించగానే, బయటకు రావడం మొదలుపెట్టింది శత్రు దళం. నాకు దాక్కునే అవకాశం కూడా లేకుండా పోయింది.

అటూ ఇటూ చూసి గబుక్కున నా తోటి సైనికుని మృత దేహాన్ని నా ముందుకు లాక్కున్నాను. దాన్నే అడ్డుగా పెట్టుకొని తుపాకీ పేల్చడం ప్రారంభించాను. నేను చేస్తున్నది తప్పో, ఒప్పో తెలుసుకునే ప్రయత్నం చేయలేదు.

కావాల్సినది దేశ విజయం. మరణించి కూడా దేశ సేవ చేసే భాగ్యం ఎందరికి లభిస్తుంది!

శత్రువు పేల్చిన తూటా నా భుజంలో దూరింది. రక్తం బయటకు చిమ్మింది. అయినా, నాలో ధైర్యం చావలేదు. అవును, ఇందరి ప్రాణాలు పోగా లేనిది, నాకు తగిలిన దెబ్బ ఒక లెక్కా.

బాధ భరిస్తూ, కాల్పులు కొనసాగించాను. నేను ఒక్కడినే అని ధైర్యంగా బయటకు వచ్చిన వారంతా క్షణాల్లో నా కాల్పులకు పిట్టల్లా కూలిపోయారు.

మెల్లగా లేచి నిలబడ్డాను. అడుగు వేయడం కష్టంగా ఉంది. మెల్లగా నడిచి స్థావరంలో అడుగు పెట్టాను. ఎవ్వరూ లేరు.

సాధించాను. అవును మేము సాధించాము, మన దేశం ఈ స్థావరాన్ని తిరిగి చేజిక్కించుకుంది. నిస్తబ్దత ఆవరిస్తోంది.

కళ్ళమీద చల్లని నీరు పడటంతో కళ్ళు తెరిచాను. చల్లటి, ప్రశాంత వాతావరణంలో హాస్పిటల్ బెడ్‌మీద నేనున్నాను. తెలివి రావడంకోసం డ్యాక్టర్ చల్లిన నీటి జల్లు అది.

నేను అక్కడ చేరి ఎంతకాలం అయిందో తెలీదు. దూరంగా అమ్మ, నాన్న, తాత, బామ్మ.

ఆనందం ఉవ్వెత్తున పొంగింది.

తాత చెయ్యెత్తి 'వి' అంటూ చూపారు.

'వి' అంటే విజయం.

